కథ

# కానుక

- సి.వి.నరసింహదాసు

**రాత్రి పదిగంటలకల్లా కమలని రమ్మని చెప్పాను... ఈ క్షణమో, మరుక్షణమో తను తప్పక వస్తుంది. సమయం గడుస్తున్నకొద్దీ, క్షణాలు లెక్కబెట్టుకోవడం ఎక్కువైంది. కమలను తలచుకునేకొద్దీ ఒళ్ళంతా మత్తుగా మూలుగుతోంది.**

**అసలే పౌర్ణమిరాత్రి... లక్షలకోట్ల చుక్కల మధ్యన చంద్రుడు మరీ హొయలు పోతున్నాడు. కమల వచ్చేస్తే నా ముఖం లోనూ వచ్చే వెలుగు చూస్తే, తను చిన్నబోతాడేమో...**

**ఈ రాత్రి నాకూ, కమలకూ మరచిపోలేని మధురరాత్రి కాబోతోంది. పచ్చని పొలాలు సాక్షిగా, పక్కనే పారే సెలయేరు సాక్షిగా, పైన ఆకాశం, క్రింద భూదేవి సాక్షిగా, కమల నా స్వంతం కాబోతోంది. కోర్కెల కొలిమిలో రగిలిపోతున్న నా దేహార్తిని తీర్చే రుచిర జలం కమల.**

**అసలు గతకొద్ది రోజులుగా నన్ను నేను పోగొట్టుకున్నాను. నా ఊపిరిలో, ఊహల్లో కమలే నిండిపోయింది. కళ్ళు ఆమెకోసమే తెరచుకుంటాయి. చెవులు ఆమె గొంతునే గుర్తుపడతాయి.**

నాకు ఊహ తెలిసినప్పటి నుండి కమలను ఎరుగుదును. ఆమె నాకన్నా రెండు మూడేళ్ళు చిన్న... వయసులో...

అంతాకలసి అయిదువందల ఇళ్ళున్న మా ఊళ్ళో నిజానికి అందరికీ, అందరూ ఎంతో కొంత తెలుస్తారు. పేరుకు పల్లెటూరయినా, పట్నం వాసనల్నీ గట్టిగానే పీల్చుకుంటోంది మా ఊరు. కొత్తలోకపు ద్వారాలు వడివడిగానే తెరచుకుంటున్నాయి.

గౌనులదశ దాటి లంగా జాకెట్ల మీదుగా ఓణీ వేసే లెవెల్‌కి నా కళ్ళ ముందే ఎదిగిపోయింది కమల. సరిగ్గా యిక్కడనుండే ఆమెలో ఏవోవే కొత్తందాలు నాలో ఎక్కడో సంచలనాలు రేపడం ప్రారంభమైంది.

అప్పటివరకు ఏ మాత్రం భేషజం లేకుండా అబ్బాయిలతో కూడా కలివిడిగా కలసి ఆడుకున్న కమల, పైట ఒంటిమీదకి కొత్తగా వచ్చేసరికి మాకు, ఇంకా చెప్పాలంటే నాకు క్రమంగా దూరమౌతోందేమోనని అనుమానం ప్రారంభమయింది.

దాంతో ఆమెని గమనించడం మరింత ఎక్కువైంది. అబ్బో... ఎంత త్వరగా అందాలని పెంచేసుకుంటోంది? సన్నగా రివటలావుండే అమ్మాయి బొండు మల్లెలా ముద్దుగా... బొద్దుగా మారిపోయింది. కోటేరు ముక్కుకి కొత్త కళ వచ్చింది. పెదవుల్లో వచ్చి చేరిన ఎర్రెర్రని చిరుకంపనలు, బుగ్గల్లో వెచ్చని ఆవిరులు, నుదురు, కనులు, చెక్కిలి, చుబుకం... ప్రతి భాగంలోనూ ఓ కొత్తదనం.

ఇవి చాలవన్నట్టు పైటచాటున పాలకడలిలా పొట్టభాగం, నడి సంద్రాన విహరిస్తున్న నావలా ఆ బొడ్డు, సాగరతీరాన వెలసిన రెండు హిమవన్నగాలు...

కమలలో చోటుచేసుకున్న కొత్త అందాలన్నిటికీ రక్షణలా, సమున్నతంగా గర్వంగా నిలుస్తున్న ఆ వక్ష భాగం.

నేను. పిచ్చివాణ్ణయిపోయాను. ఆ పిచ్చి పేరు కమల. నా జపతపాల మూల బిందువు కమల.

మా వెనుకవీధిలో వుంటున్న వాళ్ళకీ, మాకూ పెద్దల వైపు నుండి పరిచయాలు బాగానే వున్నాయి. నాకు వాళ్ళింటికి వెళ్ళిరావడానికి ఎవరికీ అభ్యంతరాలు లేవు. అలాగే ఆమెకీ మా యింట్లో చనువు ఎక్కువే.

గత రెండేళ్ళుగా నేను మరీ వివశుణ్ణి అయిపోయాను. కనులు మూసినా, తెరచినా ఆమె ఆలోచనలే... క్రమంగా నా ఊహా పరిధి కూడా పెరిగిపోయింది. పుస్తకాల్లో కథా నాయికా నాయకులు కరిగిపోయి వారి స్థానంలో మేము చేరిపోయాము. సినిమాల్లో హీరోహీరోయిన్లు చెరిగి పోయి, అక్కడా మేమే...

పొలాల మధ్య ఆమె పరిగెడుతుంది.. ఆమె వెనుక నేను. అందీ అందనంత దూరంలో... ఆమెను అందుకోవాలని.. ఒక్కసారిగా వీచిన గాలికి పైట ఎగిరిపోయి నా చేతిలోకి వస్తుంది. ఆమె సిగ్గుతో గుండెలకి అడ్డంగా చేతులు పెట్టుకుని నిల్చుండిపోతుంది. పైట అందిస్తున్న నాకు ఆయాసంతో ఎగిరెగిరి పడుతున్న అమృతకళశాల దర్శనం ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. రక్తం వడివడిగా నా నరాల్ని కాల్చేయడం ప్రారంభిస్తుంది. పైట అందిస్తూ, అప్రయత్నంగా నా వేలికొసలు ఆ శిఖరాగ్రాల్ని మీటుతాయి. వివశత్వం కట్టలు తెంచుకున్న ఆమె సుడిగాలిలా నన్ను చుట్టేస్తుంది. శరీరాల రాపిడిలో రగులుకున్న జ్వాల... తాపం ఆరేది, తపనలు చల్ల బడ్డాకే... పైరు పడకవుతుంది... పడతి ప్రణవనాదం...

మరోసారి... ఆమెని చూడాలని యింట్లోకి వెళ్తాను... అప్పుడే స్నానించిన ఆమె... ఒంటరిగా... దుస్తులు మార్చుకుంటూ....

ఊహించని నా ఆగమనానికి ఆమెలో తొట్రుపాటు... కమనీయదర్శనానికి నాలో తడబాటు... ఆమె శరీరంపై నుండి జారిన వస్త్రం... నా శరీరంలో పెరుగుతున్న ప్రకంపనం... ఎదురుగా నిండైన పరువాల కవ్వింపు... నాలో పురివిప్పిన కోర్కెల పలకరింపు.

ఆమె శిలాప్రతిమ... నేను అప్రయత్నంగా వేసిన ఒక వెనుకడుగు... వెంటనే ముందుకుపడ్డ పది అడుగులు... ఆమె పరిమళాలు అఘ్రాణిస్తూ, ఆ మత్తులో భుజంపైన పడ్డ చేయి వీపుమీదుగా జారి, పిరుదుల్ని పలకరించి దగ్గరగా లాక్కున్నప్పుడు... అరమోడ్పు కన్నులతో ఆమె నన్ను పైకి లాక్కుని పక్కనే వున్న సోఫాపైకి జారినప్పుడు... ఆమె అంగాంగం అనంగ రంగమై, ఆ సంగమంలో స్వర్గద్వారాలు తెరచుకున్నప్పుడు... ఆమె వేదిక... నేను నివేదిక...

చదువుకోవాలని పుస్తకం తెరిస్తే దొంగలా వచ్చి కళ్ళు మూస్తుంది. పోనీ నిద్రపోదామనుకుంటే ఊహలా చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఎలా గోలా నిద్రలోకి జారుకుంటే, కలల్లో కూడా కలవర పెడు

తుంది.

ఇవన్నీ కేవలం ఊహలే... అయితేనేం... ఎంత ఉత్తేజాన్నిస్తున్నాయి... కలలే నిజమైతే... ఆ పొందులో పసందుని స్వంతం చేసుకుంటే...!

కమల ఒప్పుకుంటుందా? అసలు తనకికూడా యిలాంటి భావాలే కలుగు తుంటాయా? నామీద తన అభిప్రాయం ఏమై వుంటుంది? ఎలా బైట పడాలి?

ఒకోసారి చాలా కన్ఫ్యూజింగ్‌గా వుంటుంది. ప్రేమంటే మనసులు కలవడం అంటారో రచనలో... ప్రేమంటే శరీరాలు ఏకం కావడంలా చూపిస్తారో సినిమాలో...

మనసులు కలవడం, శరీరాలు కలవడం ఏమిటి దంతా? కమల గుర్తొస్తే నా ఒంట్లో తీయని బాధ... అది శారీరకం కదా... ఆ బాధ పోవాలంటే ఆమెతో శృంగార క్రీడలే కదా మందు...

మనసులు కలవడమంటే! ఒకరికొకరు నచ్చడం కావచ్చు... నాకు కమల మరీమరీ నచ్చేసింది. ఆమెకీ నేను నచ్చేవుంటాను. లేకపోతే మొన్న వీధిలో కనిపించినప్పుడు పలకరింపుగా ఎందుకు నవ్వుతుంది? అమ్మను కలుసుకునే నెపంతో వచ్చి నాపై దొంగచూపులు ఎందుకు విసురుతుంది? నేను కూడా చూస్తున్నానని గ్రహించగానే టక్కున చూపుఎందుకు మరల్చుకుంటుంది? ఇంకా చెప్పాలంటే బోలెడు దొరుకుతాయి ఉదాహరణలు.

అంటే.. ఆమె కూడా నన్ను ప్రేమిస్తోందన్న మాటేగా... యాహూ ... వియార్ ఇన్ లవ్...

కాకపోతే అదే విషయాన్ని నిర్ధారించుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను... అది ఇన్నాళ్ళకు వచ్చింది.

ఈ రోజు కమల పుట్టినరోజు... ఉదయం అమ్మ దగ్గరకొచ్చింది ఆశీర్వదించమంటూ... నిజంగా నాకు మతిపోయింది. ఆమె అందం... ఎంత స్వచ్ఛత? ఎలాంటి కృత్రిమ వేషధారణ లేదు... ప్రకృతిలా హాయిగా వుంది. కమలంలా ఆహ్లాదంగా వుంది. కమలా ఫలంలా తీయగా వుంది.


తెచ్చిన పాయసాన్ని నా ముందుపెట్టి తీసుకోమన్నట్టు చూసింది.

ఇది ప్రతీ యేడాది జరిగేదే... కానీ ఈసారి మరింత కొత్తగా వుంది. అలా చూస్తూ ఎంతసేపుండిపోయానో... కాసేపటికి తేరుకుని పిచ్చివాడిలా పరుగు పెట్టాను... ఆమె వెళ్ళిందనుకున్న వైపు.... నా ఊహ తప్పుకాలేదు.

పెరట్లో మామిడి చెట్టు నుండి కాయ కోయ డానికి ప్రయత్నిస్తోంది... మా పెరటి చెట్టు కాయలు భలే తీపిగా వుంటాయి. అప్పుడప్పుడు కోసుకు వెళ్ళడం ఆమె కలవాటే..

కమల కోరుకున్న కాయ అందీ అందనంత ఎత్తులో వుంది. అందుకే ఏ కర్ర సాయమూ చూడకుండా తనే అందుకోవాలని ప్రయత్నిస్తోంది.

ఓణీ అంచు బిగించి నడుంలో దోపిందేమో, కాయ అందుకునే ప్రయత్నంలో, ఓ పక్క నుండి ప్రదర్శితమౌతున్న ఒంపులు రెచ్చగొట్టేలా వున్నాయి. నాలో టెంప్టేషన్... అమ్మ వీధిలో ఎవరితోనో



మాట్లాడుతోంది... ఇంకెవ్వరూ లేరు... మెల్లగా కమల వెనుకగా చేరి సాయపడనా అన్నట్లు కనుబొమ్మలెగరేశాను. ప్లీజ్ అన్నట్లు చూసింది... బాప్ రే.. చూపు సూదంటురాయి...

ఆమె ఊహించని విధంగా నడుం మీద చేతులేసి పైకి లేపాను. ''ఇక అందుకోమన్నట్లు''గా.... నా ఊపిరి ఆమె పొట్టమీద వెచ్చగా గుచ్చు తుందని తెలుసు.

ఆమె మ్రాన్పడిపోయింది. కాయ అందుకుంది. నాకాలు మెలిక పడి పట్టు తప్పిన నా పై... ఆమె జారి పడింది.

మొదటిసారి... నాపై ఓ పూలచెండు...

''ఐ లవ్యూ కమలా... ఐ లవ్యూ'' నా కలవరింత...

ఆమె లేచి, ఒక్క ఉదుటున పారిపోబోతుంటే, చేయిపట్టి లాగి ఆపాను. ఎక్కువ సమయం లేదు. మనసులోని కోరిక చెప్పేయాలి.

''రాత్రి పది గంటలకి చెరువు ఒడ్డున అమ్మవారి

గుడి దగ్గరికి రా కమలా... నువ్వు మరచిపోలేని పుట్టినరోజు కానుక ఇవ్వబోతున్నాను... రాకపోతే నా మీదొట్టే.... తప్పక వస్తావు కదూ....!''

ఆమె సమాధానం చెప్పలేదు. అక్కడి నుండి పారిపోయింది.

నా చర్య ఆమెకి కోపం తెప్పిస్తుందా? ఇప్పటి వరకు వున్న చనువు, పరిచయం యింతటితో ఆగిపోతుందా? అసలు రాత్రి పదింటికి ఎందుకని రమ్మన్నాను? ఆమె రాగలదా? వస్తుందా?

పగలంతా అల్లకల్లోలంగా గడిపాను. రాత్రి భోజనం అవుతూనే అమ్మతో ఏదో చెప్పేసి, తిన్నగా ఆలయం దగ్గరికి చేరుకున్నాను.

వెన్నెల విరగకాస్తోంది.

కమల తప్పకవస్తుంది.

ఎలాగోలా... ఎలాగైనా వస్తుంది. నా సిక్త్‌సెన్స్ చెబుతోంది. కమలానుభవం కలుగుతుంది. నా శరీరానికి అమోఘానుభూతి సిద్ధిస్తుంది.

క్షణక్షణం... ఎలాగోలా గడిచి...

నా ఊహే గెలిచింది.

ఆమె రాకలోని పరిమళం తెలిసింది. వనదేవతలా కమల ఎదుట నిలిచింది.

ఆమె సాహసి.... నేను తామసి...

ఈ రాత్రి... తపనలురేగిన తనువుల్లో ఇంద్రధనుస్సులు విరుస్తాయి. ప్రేయసీప్రియుల విరహాగ్నిలో అమృతధారలు కురుస్తాయి.

నా భావం ఆమె గ్రహించే వుంటుంది. అందుకే వచ్చింది.... గుడి వెనుక పచ్చిక పక్క సిద్ధంగా వుంది. ఎదురుగా శృంగార రసాధి దేవత ఎదురు చూస్తోంది....

నా శరీరం కోర్కెల కొలిమై పోయింది.

''ఐ లవ్యూ కమలా'' ఆమెకు దగ్గరగా జరిగి భుజం మీద చేయి వేయ బోయాను... ఆమె ఓ అడుగు వెనక్కివేసింది... అది సిగ్గా... సంశయమా... సంకోచమా...

''రా కమలా... ఈ రాత్రి అమృతం కురిసే రాత్రి... నువ్వు నాలో, నేను నీలో కరిగిపోతూ కలిసిపోతూ స్వర్గం అంచులు తాకే రాత్రి. ఇదే నేను నీకివ్వబోయే నీ పదిహేనో పుట్టినరోజు కానుక'' ఆర్తిగా ఆమెను అందుకోబోయాను.

కమల మరో రెండడుగులు వెనక్కి జరిగింది.

''ఒక్కక్షణం సందీప్... నువ్వు నా చిన్ననాటి నేస్తానివి... నిన్ను ప్రశ్నించ డానికీ, ప్రేమించడానికీ సరిపడా చనువు నాకుంది. ఆ చనువుతోనే చెబుతున్నాను. గత కొంతకాలంగా నీలో వస్తున్న మార్పుని బాగా గమనిస్తున్నాను.

పెద్దమనిషైనప్పటి నుంచి ఆడపిల్లలో శారీరకంగా చెప్పుకోదగ్గ మార్పులు చోటుచేసుకుంటాయి. జీవితం గురించి తెలుసుకునే పరిణితి కూడా పెరుగుతుంది. నిన్నటివరకు తమతో ఎలాంటి భేషజం లేకుండా తిరిగిన అమ్మాయిలో ఈ శారీరక, మానసిక మార్పులు, యుక్త వయస్కు లైన అబ్బాయిల్లో తెలీని ఆందోళనకి గురిచేస్తాయి. సమాజం, పరిసరాల ప్రభావంతో ఆలోచనలు పరిపరివిధాల చలిస్తాయి. కొంత తెలీనితనం, కొంత అపరాధభావం తమ ప్రమేయం లేకుండానే ఆ అమ్మాయికి దూరం చేస్తాయి.

నీ విషయంలోనూ అదే జరిగింది. క్రమంగా నువ్వే నాకు దూరమవడం ప్రారంభించావ్... అది గుర్తించలేక, నాపై ఆలోచనల్ని అదుపులో పెట్టుకోలేక సతమతమైపోయావ్.... ఇప్పుడొస్తున్న సినిమాల ప్రభావంతో 'ప్రేమ' అనే భావనని ప్రేమించావు. ప్రేమంటే అమ్మాయి, అబ్బాయి శారీరకంగా కలవడం అనే భ్రమలోనే జీవించావు. ఎప్పుడైతే నీలో యిలాంటి భావనలు ప్రారంభమయ్యాయో, ఆ రోజు నుండి నీ ప్రవర్తన మారిపోయింది. నన్ను చూస్తే తత్తరపాటు, నా కళ్ళలోకి ఎప్పటిలా నిష్కల్మషంగా చూసి మాట్లాడలేక నేల చూపుల అలవాటు... ఇవన్నీ నేను గ్రహించాను.

కామాన్ని ప్రేమనుకుని నువ్వు చదువుని కూడా నిర్లక్ష్యం చేశావ్... ఫలితం... ప్రస్తుతం నువ్వు ఇంటర్ ఫెయిల్డ్.... పదేళ్ళక్రితం మీ నాన్న చనిపోతే, అన్నీ తానై నీకోసమే బ్రతుకుతున్న మీ అమ్మ ఆశలపై చన్నీళ్ళు.

సందీప్... నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను. ఆటపాటల్లోనే కాదు.. చదువు లోనూ ఒకప్పుడు ఫస్ట్ రాంకర్‌గా వున్న సందీప్‌ని ప్రేమిస్తూనే వున్నాను. ''నేను గొప్ప డాక్టర్ నై, ఈ ఊరి వారికి ఉచిత సేవ చేస్తానమ్మా'' అంటూ తన తల్లికి మాట ఇచ్చిన ఆ ఆదర్శాల సందీప్‌ని ప్రేమిస్తూనే వున్నాను.

నీలో ఆ సందీప్ యికపై లేడనుకుంటే, కేవలం నా అందాన్ని అందుకోవడమే నీ లక్ష్యం అనుకుంటే, ఆ కోర్కె తీర్చడానికి వచ్చాను. కనీసం ఆ తర్వాతయినా నువ్వు నా పాత సందీప్‌ని అవుతావనే ఆశతో...

రా... సందీప్... ఈ శరీరాన్ని నీకు అర్పిస్తున్నాను...''

ఆమె నా చేయందుకుని మెడ వంపుపై వేసుకుంది. కొనగోటి కదలిక చాలు, పైట తొలగించడానికి....

కానీ.... అప్పటికే నా చేతివేళ్ళు మొద్దుబారిపోయాయి. మనసులాగే...

క్రమంగా... ఆలోచనలు పొరలుపొరలుగా కరిగాయి. జ్ఞానధార శరీరాన్ని తడిపేసింది....

నేను మనిషిని... కనులముందు తెరలు జారిపోయాయి... కర్తవ్యం కదలాడుతోంది...

కమల నుదిట మనసారా ముద్దుపెట్టాను... అది మొదటి ముద్దు..

***

కమలకి నేనిచ్చిన రెండో ముద్దు, ఆమె డాక్టర్ సందీప్‌కి భార్యగా మొదటి రాత్రి పక్క మీద శోభనం 'పాలు ' పంచుకుంటున్నప్పుడు...

అప్పుడు కురిసింది అమృతం... నిరంతరంగా కురుస్తూనే వుంది.

*



రచయిత ఫోన్ నెం. 0891-2737579